www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 6 ఫిబ్రవరి 2023



వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్‌గా నతానియేల్



ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని గోపన్నపాలెం శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఎస్.నతానియేల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నతానియేల్ గతంలో కామవరపుకోట మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇప్పటివరకూ ప్రిన్సిపల్‌గా పని చేసిన ఎస్‌కె.సలీంపాషా ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. వ్యాయామ ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నూతన ప్రిన్సిపల్ నతానియేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉల్లాసం.. ఉత్సాహం..





మాట్లాడుతున్న బాలోత్సవం రూపకర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు



- రెండోరోజు కొనసాగిన హేలాపురి బాలోత్సవం
- సాంస్కృతిక, అకడమిక్ పోటీల్లో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు
- బాలోత్సవం కార్యక్రమాలతో పిల్లల్లో ఆత్మస్థయిర్యం
- బాలోత్సవం రూపకర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు ఆదివారం రెండోరోజు సిఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. బాలోత్సవ కార్యక్రమాలకు మంచి స్పందన లభించింది. 60 రకాల కల్చరల్, అకడమిక్ పోటీలు ఒకే ఆవరణలో జాతరలా సాగాయి. రెండో రోజు ప్రారంభ కార్యక్రమంలో బాలోత్సవం రూపకర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ కొత్తగూడెంలో 25 సంవత్సరాలపాటు తాను చేపట్టిన బాలోత్సవం అన్ని ప్రాంతాలకూ విస్తరించడం ఆనందంగా ఉందన్నారు. పిల్లల జీవితంలో బాలోత్సవం మరపురాని తీపి జ్ఞాపకమని చెప్పారు. పాశ్చాత్య విష సంస్కృతి వ్యాప్తి చెందిన ఈ రోజుల్లో బాల్యంలోనే అభ్యుదయ విలువలకు బాటలు వేయాల్సి ఉందన్నారు. చెడు సంస్కృతికి వ్యతిరేకంగా మంచి సంస్కృతిని ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, ఆహ్వాన సంఘం నాయకులు ఉప్పలపాటి చక్రపాణి, అడుసుమిల్లి నిర్మల, మారుబోయిన కోటేశ్వరరావు, విజిఎంవిఆర్.కృష్ణారావు, డి.హేమసుందర్, ముస్తఫా ఆలీ, సాయి కుమారి శంకర్, జె.సత్యనారాయణరాజు, ఎంఎస్.కాంతారావు, జి.నీలిమ, బి.మోహన్‌రావు, ఎబి.త్రిపురసుందరి, పి.కనకదుర్గ, పి.కస్తూరిబాయి, కె.శ్రీనివాస్, ఎంజిఎన్‌వి.రత్నం, వై.ఆనందనాయుడు, ఎస్.కస్తూరిరావు, శ్రీహరికోటి తదితరులు పాల్గొన్నారు.



జానపదాలకు విశేష ఆదరణ

బాలోత్సవం పిల్లల సంబరాల పోటీల్లో జానపద నృత్య పోటీలకు విశేష ఆదరణ లభించింది. 80కి పైగా టీములు జానపద నృత్య పోటీల్లో వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొని చూపరులను ఆకట్టుకున్నారు. పల్లె వాతావరణంతో కూడిన పాటలు, లంబాడీ జానపద నృత్యం, దేశభక్తి భావంతో ఉన్న పాటలు జానపద నృత్య రూపంలో పిల్లలు చక్కగా ప్రదర్శించారు. దేశభక్తిని ప్రేరేపించే అంశాలు, కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న పాశ్చాత్య నాగరికత ప్రభావాలకు భిన్నంగా నేటి తరానికి అవసరమైన అభ్యుదయ అంశాలతో కూడిన లఘు నాటికలు ప్రదర్శన ఆకట్టుకుంది. ఏకపాత్రాభినయం, కోలాట నృత్యాలు, అభ్యుదయ పాటలు, విచిత్ర వేషధారణ, శాస్త్రీయ నృత్యం వంటి కల్చరల్ పోటీలు, మట్టి బొమ్మల తయారీ, క్విజ్, మెమొరీ, కథలు చెప్పడం వంటి అకడమిక్ పోటీలు పెద్దఎత్తున సాగాయి. రెండో రోజు పోటీల్లో దాదాపు నాలుగు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.



మట్టితో బొమ్మల తయారీ




చిన్నారుల కోలాటం





చిన్నారుల నృత్య సందడి



దీక్షకు సంఘీభావం తెలిపిన ఎన్‌జిఒ రాష్ట్ర నేత ఆర్‌ఎస్.హరనాథ్

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ఉద్యమాలపై నిర్బంధం ఆపాలి - ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఈ నెల మూడో తేదీన గన్నవరం దగ్గర ధర్మస్థలిలో చేపట్టిన సంకల్ప దీక్షను రాష్ట్ర ప్రభుత్వం భగ్నం చేయడాన్ని నిరసిస్తూ స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం సంకల్ప (నిరాహార) దీక్ష చేపట్టారు. ఈ దీక్షను ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానుద్దేశించి సాబ్జీ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని గడిచిన కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో అనేక ఆందోళనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం, ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్.హరనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని అధికారంలోకొచ్చి మూడు సంవత్సరాలైనా అమలు చేయకపోగా గ్యారెంటీ లేని జిపిఎస్ విధానాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకురావడం దారుణమన్నారు. తక్షణం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరారు. జిల్లా జెఎసి నాయకులు నెరుసు రామారావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోరుతూ ప్రజాస్వామ్యయుతంగా సాగుతున్న పోరాటంలో ఉపాధ్యాయులను పాఠశాలల్లోనే అరెస్టు చేసి విద్యార్థుల దృష్టిలో నేరస్తులుగా చిత్రీకరించటం దారుణమన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులపై మోపిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. ఈ దీక్షలో యుటిఎఫ్ నేతలు బి.సుభాషిణి, జిల్లా పివి.సాగర్, పి.వీరకోటి, ఎంవి.అప్పారావు, వి.కనకదుర్గ, విబివిఎస్.సుబ్రహ్మణ్యం, ఎ.విక్టర్, జివి.రంగమోహన్, సిపిఎస్ జిల్లా కన్వీనర్ కె.కమల్‌కుమార్, కోకన్వీనర్ సిహెచ్.స్వర్ణరేఖ, నేతలు పాల్గొన్నారు.

12న కలిదిండిలో పిల్లలకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 12న పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషన్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. గుడివాడ ఉమా పిల్లల వైద్యశాల, విజయవాడ అంకుర హాస్పటల్స్, రెయిన్‌బో హాస్పటల్స్ వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. వైద్యులు సిఫార్సు చేసిన పరీక్షలు చేయించడంతోపాటు మందులు ఉచితంగా అందజేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు కోరారు.

పథకాలు ప్రజలకు చేరవేయడమే లక్ష్యం

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి - నగర కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



ఏలూరు నగరపాలక సంస్థగా అవతరించి 17 ఏళ్లవుతోంది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఏలూరు ఇప్పటికీ అనుకున్నంత అభివృద్ధి సాధించలేదనే అభిప్రాయం నగర ప్రజల్లో వేళ్లూనుకుని ఉంది. నిధుల లేమి ప్రధాన సమస్యగా వెంటాడుతోంది. ఒకపక్క అవినీతి ఆరోపణలు, మరోపక్క సిబ్బందిలో సమన్వయ లోపం నగరపాలక సంస్థపై జనం నమ్మకాన్ని పోగొడుతున్నాయి. ఈ దశలో అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ నగరపాలక సంస్థను అభివృద్ధి దిశగా నడిపించడానికి కృషి చేస్తానని ఏలూరు కార్పొరేషన్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంక్రాంతి వెంకటకృష్ణ చెబుతున్నారు. ప్రధానంగా ఏలూరును సుందర నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో కమిషనర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..



ప్రశ్న: ఏలూరులో సుందరీకరణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏలూరును పరిశుభ్రమైన సుందర నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తాను. ఎంఎల్‌ఎ ఆళ్ల నాని, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, పాలకవర్గం సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడతాం. నగర ప్రజల్లో చైతన్యం తెచ్చి చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నగర ప్రజలకు ప్రభుత్వ పథకాలను ఎలా అందించాలని భావిస్తున్నారు?

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నవరత్నాల పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించేలా చర్యలు చేపడతాం. అందుకు సచివాలయ సిబ్బంది, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటాం. ఇళ్ల లబ్ధిదారులను ప్రోత్సహించి గృహ నిర్మాణాలకు చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

ప్రశ్న: రోడ్లపై పశువులను వదిలితే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని గత కమిషనర్ ప్రకటించారు. మీరు ఎలాంటి చర్యలు చేపడతారు?

నగరంలో పందులు, కుక్కల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్లపై విచ్చలవిడిగా పశువులను వదిలేస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తాం. నగరంలోని రోడ్లపై పశువుల సంచారం ఎక్కువగా ఉంది. వాటి వల్ల వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై వదిలేసిన పశువులను పట్టుకుని పశువుల దొడ్డికి తరలిస్తాం. వారం రోజుల వ్యవధిలో వాటి యజమానులు జరిమానా చెల్లించి విడిపించుకు వెళ్లాల్సి ఉంటుంది.

ప్రశ్న: ప్రకటన ఛార్జీల వసూళ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో ప్రకటన ఛార్జీల వసూళ్లకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటాం. సచివాలయంలోని ప్లానింగ్ సెక్రటరీలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్ ప్రతిరోజూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని అనధికార నిర్మాణాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు ఇస్తారు. నగరపాలక సంస్థ పరిధిలోని విలీన పంచాయతీల్లో ప్రభుత్వ చెరువులు ఆక్రమణలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాం.

ప్రశ్న: ప్లాస్టిక్ నిషేధంపై ఎలాంటి చర్యలు చేపడతారు?

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థులను భాగస్వాములను చేస్తాం. ప్లాస్టిక్ కవర్స్‌ను, 75 మైక్రాన్లకన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిషేధించినట్లు కరపత్రాలు, మాధ్యమాల ద్వారా చైతన్యపరుస్తాం. జ్యూట్‌బ్యాగుల వాడకం, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పిస్తాం.

ప్రశ్న: మార్కెట్ల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఏలూరు మార్కెట్లలో వ్యాపారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపడతాం. మార్కెట్లో నీరు, డ్రెయినేజీ వ్యవస్థ, పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా ఖాళీగా ఉన్న షాపులను గుర్తించి త్వరలోనే వేలంపాటలు నిర్వహించి ఆదాయం పెంపునకు కృషి చేస్తాం. వారంలో ఒకరోజు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, శానిటరీ సిబ్బందితో కలిసి మార్కెట్ సముదాయాలను పరిశీలించి, ఆక్రమణలు తొలగించి, అక్రమ వ్యాపారాల నిరోధానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నగరపాలక సంస్థకు నిధుల కొరతను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

నీటి పంపు, కమర్షియల్ నీటి పంపు కనెక్షన్ల పరిశీలనకు, వాటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ టీముల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి సచివాలయ పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలు, సచివాలయ అడ్మిన్లతో కలిసి రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలాలను గుర్తించి వాటికి పన్ను విధించేలా చర్యలు తీసుకుంటాం. కార్పొరేషన్ పరిధిలో నిర్వహణ సరిగా లేని, పన్నులు లేని ఖాళీ స్థలాల వివరాలను సేకరిస్తాం. ఆయా స్థలాల డాక్యుమెంట్లను పరిశీలించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేస్తాం.

'బోరు'మంటున్నారు..!

- 'జలకళ'పై రైతుల్లో తీవ్ర అసంతృప్తి
- వేయాల్సిన బోర్ల లక్ష్యం 3,705
- రెండున్నరేళ్లలో వేసినవి 1,178 మాత్రమే
- సగానికిపైగా బోర్లకు కానరాని విద్యుత్ కనెక్షన్
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు
- దిక్కుతోచక రైతులు లబోదిబో



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం తెచ్చిన 'వైఎస్ఆర్ జలకళ' పథకం రైతులకు ఏమాత్రం అక్కరకు రాని దుస్థితి నెలకొంది. ఈ పథకం అమలు అత్యంత పేలవంగా ఉందంటూ రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్న తీరుతో బోర్లు వేసుకునేందుకు సైతం చాలాచోట్ల రైతులు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. 2020 సెప్టెంబర్ 28న వైఎస్ఆర్ జలకళ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 3,705 బోర్లు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గడిచిన రెండున్నరేళ్లలో అధికారుల లెక్కల ప్రకారం చూస్తే 1,178 బోర్లు వేసినట్లు చూపిస్తున్నారు. లక్ష్యం మేరకు రెండువేలకుపైగా బోర్లు వేయాల్సి ఉన్నప్పటికీ ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఇక వేసినట్లు లెక్కలు చూపుతున్న బోర్లలో సగానికి కూడా విద్యుద్దీకరణ జరగలేదని రైతులు చెబుతున్నారు. అంటే బోరు వేసినా రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరలేదని తేటతెల్లమవుతోంది. జలకళ పథకంలో ఉన్న లోపాలే దీనికి కారణంగా రైతులు చెబుతున్నారు. రెండున్నర ఎకరాల నుంచి ఐదెకరాలు వరకూ ఉన్న ప్రతి రైతూ జలకళలో బోరు వేసుకునేందుకు అర్హులే. బోరు కోసం దరఖాస్తు చేసుకుని నెలలు, ఏళ్లు గడుస్తున్నా వేసిన పరిస్థితి లేదని రైతులు చెప్పుకొస్తున్నారు. జలకళ పర్యవేక్షణ సైతం అత్యంత దారుణంగా ఉందనే భావన రైతులకు వ్యక్తమవుతోంది. ఈ పథకంలో కాంట్రాక్టర్‌దే ఇష్టారాజ్యం అన్నట్లు సాగుతోంది. తొలుత విద్యుత్ కనెక్షన్ కూడా ప్రభుత్వమే ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత విద్యుత్ కనెక్షన్ రైతులు వేయించుకోవాలని మాటమార్చింది. ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్న పని కావడంతో రైతులు జంకుతున్నారు. 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2022 నవంబర్ 30వ తేదీ వరకూ జిల్లాలో 127 బోర్లు మంజూరైతే 57 బోర్లకు మాత్రమే డ్రిల్లింగ్ జరిగింది. దీనిలో విద్యుద్దీకరణ పూర్తయిన బోర్లు కేవలం ఆరు మాత్రమే. దీన్నిబట్టి జలకళ జిల్లాలో ఏవిధంగా ముందుకు సాగుతుందో చెప్పనక్కర్లేదు. బోరు వేయాలంటే కనీసంగా రూ.ఐదు లక్షలకుపైనే ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం రూ.రెండు లక్షలు మాత్రమే జలకళ పథకంలో అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఉచిత బోరు అంటూ చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేకుండాపోయిందని రైతులు చెబుతున్నారు.


మీరు బోరు వేసుకుంటే ఫొటో తీసుకుంటాం

రైతులకు బోరు మంజూరైతే సంబంధిత కాంట్రాక్టర్ రైతులతో మాట్లాడి బోరు వేయాల్సి ఉంటుంది. అయితే చాలాచోట్ల ఆవిధంగా కాకుండా రైతులే అన్ని ఖర్చులూ పెట్టుకుని బోరు వేసుకోవాలని కాంట్రాక్టర్లు సూచిస్తున్నారు. బోరు వేసుకున్న తర్వాత తాము వచ్చి రిగ్గుతో ఫొటో తీసుకుంటామని, ప్రభుత్వం సొమ్ము వేసిన తర్వాత రైతుకు ఇస్తామని చెబుతున్నారు. దీనిలో అధికార పార్టీ నాయకుల జోక్యం విపరీతంగా ఉంటోందని రైతులు చెప్పుకొస్తున్నారు. బోరు వేయించుకునే రైతులు కనీసంగా రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు అనేక మండలాల్లోని రైతులు వాపోతున్నారు. సొంత సొమ్ము ఖర్చు పెట్టుకుని బోరు వేసుకునే స్థోమత ఉంటే జలకళ పథకంలో దరఖాస్తు చేసుకోవడం ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే చాలాచోట్ల మంజూరైన బోర్లు కూడా వేయకుండా ఉండిపోయినట్లు రైతులు చెబుతున్నారు. జలకళ పథకంలో ఏదైనా సమస్య వస్తే గ్రామస్థాయిలో రైతులు ఏఅధికారిని కలవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో కాంట్రాక్టర్, స్థానిక వైసిపి నాయకులు చెప్పిందే వేదం అన్నట్లు తయారైంది. ఇలా అనేక కారణాలు ఉండటంతో రైతులు బోర్లు వేసుకునేందుకు సైతం ముందుకు రావడం లేదని తెలుస్తోంది. జలకళ పథకంలో బోర్లు వేసుకునే విషయంలో ఎదురవుతున్న సమస్యలతో రైతులు బోరుమంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని జలకళ అమలులో సమస్యలపై కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తే రైతులు ముందుకొచ్చే పరిస్థితి ఉంటుంది. లేకపోతే ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమం ఎండమావిగానే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడనుంది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఎంఎల్ఎ ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. మండలంలోని గణిచర్ల గ్రామంలో ఆయన ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గంథం బేబి తనపేరున ఇంటిపునాదుల ఫొటోలు పెట్టి రూ.75 వేలు బిల్లు పడుతుందని చెప్పారని, అయితే బిల్లు పడలేదని, దీనిపై అడిగితే పడ్డాయని చూపుతుందని అంటున్నాని వాపోయారు. దీనిపై ఎవరికి ఫోన్ చేసినా కనీసం ఫోన్ తీయడం లేదన్నారు. దీంతో ఎంఎల్ఎ ఎలిజా ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఇంటి బిల్లు మరో ఇంటికి ఎలా పెడతారని నిలదీశారు. దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు ప్రమాదకరంగా ఉన్నాయని పలువురు ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంఎల్ఎ నేగారు ఎస్ఇకి ఫోన్ చేసి స్థానిక విద్యుత్ శాఖాధికారులు సమస్యల పరిష్కారానికి సహకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాల దిలీప్, సిటీ మెడికల్ దుర్గారావు, కొప్పుల నాగు, రాజ్ ప్రకాష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగిని హెచ్చరిస్తున్న ఎంఎల్ఎ



మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

సిపిఎస్ రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

యుటిఎఫ్ ఏలూరు మండల శాఖ వార్షిక నూతన కౌన్సిల్ సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆ శాఖ అధ్యక్షులు పాటూరి సురేష్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు చేసే ప్రతి పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నంబూరి రాంబాబు, పరిశీలకుడిగా పి.వి.నరసింహారావు, గౌరవ అధ్యక్షులుగా ఒవి.ధనుంజయరావు, అధ్యక్షులుగా పాటూరి సురేష్‌బాబు, సహాధ్యక్షులుగా కె.శ్రీధర్, జి.మాధవీలత, ప్రధాన కార్యదర్శిగా పంపన శ్రీనివాస్‌కుమార్, కోశాధికారిగా తాడేపల్లి యేషయ్య, కార్యదర్శులుగా పివి.జనార్ధనరావు, పివి.సుబ్బారావు, వి.ప్రభాకరరావు, ఎ.సూర్యచంద్రరావు, సిహెచ్.చిన్నికృష్ణ, జి.శ్రీనివాసరాజు, కెవిఎస్.మణి, పి.సత్యనారాయణ, దుర్గాభవాని, ఆడిట్ కన్వీనర్‌గా బి.రవిశోభన్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా ఎఎస్‌కె.సుభాణిబేగం, కనకదుర్గ, ఎవిఎస్.రాజు, ఎల్.కనకదుర్గ ఎన్నికయ్యారు.

గుండెపోటుతో ఫణికుమార్ మృతి

ప్రజాశక్తి -ఉంగుటూరు



ఫణికుమార్ (ఫైల్)

ఉంగుటూరు మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న భోగరాజు ఫణికుమార్ ఆదివారం గుండెపోటుతో ఆశ్రం ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకున్నారు. ఆదివారం ఉదయం ఛాతి నొప్పి రావడంతో ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు. ఆయన మృతికి రెవెన్యూ కార్యాలయం అధికారులు, ఉద్యో గులు సంతాపం వ్యక్తం చేశారు. ఫణికుమార్ స్వగ్రామం ద్వారకాతిరుమలకు మృతదేహాన్ని తరలించారు. పలువురు రెవెన్యూ అధికారులు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. డిసెంబరు 31వ తేదీన కార్యాయలం అడెండర్ పీరా కూడా గుండెపోటుతో మృతిచెందడం వెంటనే ఫణికుమార్ ఛాతినొప్పితో మరణించడంతో కార్యాలయం ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు.

8న జిల్లాస్థాయి భూ సదస్సు : వ్యకాస

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని వందరామన్నపాలెం ఎర్రకాలువ మిగులు భూముల్లో ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి భూ సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి, ఉపాధ్యక్షులు తామ ముత్యాలమ్మ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూ పోరాట కేంద్రాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొని జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

తలసేమియా చిన్నారులకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి - చింతలపూడి

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సాయి స్ఫూర్తి మల్టి స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించనున్నట్లు ఎంపిపి రాంబాబు తెలిపారు. పట్టణంలో సాయి స్ఫూర్తి, మల్టి స్పెషలిటీ హాస్పిటల్ వద్ద తలసేమియా నూతన వార్డును ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఫీజులు లేకుండా చిన్నారులకు ఉచిత వైద్యం, ఉచిత మందులు అందించారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎస్‌సి పేటలో యర్రారపు రాజేష్ (35) ఆదివారం తెల్లవారుజామున అనుమాస్పదంగా మరణించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉంగుటూరుకు చెందిన రాజేష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో రాజేష్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆమె ఇంటికి ఆదివారం తెల్లవారున వెళ్లిన రాజేష్ ఆమె ఇంటి వద్దే మరణించడంతో రాజేష్ కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

నిందితుల కోసం గాలింపు

ప్రజాశక్తి - ముసునూరు

కాట్రేనిపాడులో జరిగిన తల్లి కుమార్తె హత్య కేసులో నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ, నూజివీడు డిఎస్‌పి కె.అశోక్ కుమార్ గౌడ్, నూజివీడు సిఐ అంకబాబు, ముసునూరు ఎస్‌ఐ ఎం.కుటుంబరావు తమ సిబ్బందితో పాటు క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ టీమ్ సభ్యులతో ఆ ఇంటి పరిసరాలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం జాతీయ రహదారిపై వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి వచ్చిన ఆటో ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ తమ్మిలేటి అంజిబాబు గాయాలపాలయ్యాడు. అతడిని స్థానికులు వెంటనే వేరే ఆటోలో చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం సాయి స్ఫూర్తి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నల్లమాడు పంచాయతీ పరిధి రామచంద్రపురంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో రూ.80 వేలు, 20 కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ పందేల్లో ఇద్దరు సర్పంచులు ఉన్నట్లు తెలిసింది. వారిలో ఒకరు ఉత్తమ సర్పంచి అవార్డు గ్రహీత కావడం గమనార్హం.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

జీలుగుమిల్లి :రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మండలంలోని వంకవారిగూడెం వద్ద ఈ నెల రెండో తేదీన రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ములగలంపల్లి గ్రామానికి చెందిన కె.వెంకన్న (32) తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని స్థానికులు 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరుకు అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని ఆదివారం స్వగృహానికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకన్న మృతితో కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని సత్యనారాయణపురం వద్ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమంగా తరలిస్తున్న 29 టన్నుల రేషన్ బియ్యం లారీని పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ పనుల్లో డ్రోన్ల వినియోగం

ప్రజాశక్తి - భీమడోలు



వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ ద్వారా మందులు పిచికారీ

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కొన్ని పనుల నిర్వహణకు డ్రోన్‌లను వినియోగించేందుకు వ్యవసాయ శాఖ రంగం సిద్ధం చేసింది. దీనిలో భాగంగా ప్రతి రైతు భరోసా కేంద్రం అనుమతి పొందిన క్లస్టర్ హైరింగ్ గ్రూపు (సిహెచ్‌జి) ద్వారా డ్రోన్ సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. వచ్చే ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే జూన్, జులై నెలలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ల వారీగా ఎంపిక చేసిన కొందరికి జిల్లాస్థాయిలో డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు ప్రారంభించారు. డ్రోన్ సేవలను రైతులకు వివరించేందుకు భీమడోలులో జిల్లాస్థాయిలో ఒక ప్రయోగాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి వేదికగా వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ పి.ఉషారాజకుమారి ఆధ్వర్యంలో 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న క్లస్టర్ పొలంబడి నిర్వహిస్తున్న క్షేత్రాన్ని ఎంపిక చేశారు. క్లస్టర్ హైరింగ్ గ్రూపుగా ఏర్పడిన సభ్యుల్లో కనీస విద్యార్హతగా ఇంటర్ లేదా డిగ్రీతోపాటు పాస్ పోర్ట్ ఉన్నవారికి డ్రోన్ వినియోగంలో శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి డ్రోన్ వినియోగానికి ప్రభుత్వపరంగా అవసరమైన అనుమతులను వ్యవసాయ శాఖ అందిస్తుంది. డ్రోన్ నిర్వహణకు ముందుకు వచ్చిన సిహెచ్‌సిజి గ్రూపునకు ప్రభుత్వం డ్రోన్ ధరలో 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంకు రుణం అందిస్తారు. ఈ క్రమంలో గ్రూపు వాటాగా పది శాతం కట్టాల్సి ఉంటుంది. డ్రోన్ నిర్వహణకు ముందుకు వచ్చిన సభ్యులు సాయి వ్యవసాయ పట్టభద్రులై ఉంటే వారికి డ్రోన్ కొనుగోలుకు 50 శాతం రాయితీ, 40 శాతం బ్యాంకు రుణంగా అందిస్తారు. ఎకరం విస్తీర్ణంలో పిచికారీ చేసేందుకు రూ.500 వరకు ఛార్జ్ చేసే అవకాశం ఉంది. 10 నుంచి 20 ఎకరాల విస్తీర్ణం నుంచి ఎక్కువ విస్తీర్ణంలో డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తే ఆ ఖర్చు మరింతగా తగ్గే అవకాశం ఉంది. ఇది రైతులను సహకార పద్ధతిలో వ్యవసాయ నిర్వహణ అలవాటు చేసేందుకు సహకరిస్తుందని వ్యవసాయ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

విజయరాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

కాలగర్భంలో కలిసిపోయి చరిత్ర మర్చిపోయిన దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణ, వాటి దాతల ఆశయ సాధనకు కృషి చేస్తున్న దేవాలయ ధర్మాదాయ శాఖ కాకినాడ డిప్యూటీ కమిషనర్ విజయరాజు సేవలు అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. 150 సంవత్సరాల క్రితం దాత దేవులపల్లి మృత్యుంజయుడు, వారి కుటుంబసభ్యులు భీమడోలు రైల్వేస్టేషన్, రోడ్డు మార్గాల ద్వారా భీమడోలు మీదుగా ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లే యాత్రికులు బస చేసేందుకు భీమడోలు గొలుసు గేట్ వద్ద ప్రస్తుతం కోట్లాది రూపాయల విలువైన 30 సెంట్ల స్థలంలో సత్రాన్ని నిర్మించారు. దీని నిర్వహణకు 18.79 ఎకరాల వ్యవసాయ భూమిని దానం చేశారు. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని యాత్రికులు సౌకర్యార్థం బస, ఇతర ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకించారు. ఇటీవల కాలంలో రహదారుల పరిస్థితి మెరుగుపడటం, ప్రజల జీవన విధానాలు మారడంతో సత్రంలో బస చేసే యాత్రికులు తగ్గారు. దీంతో సత్రం మూతబడింది. ఇదేవిధంగా సత్రం నిర్వహణకు దాత ఇచ్చిన వ్యవసాయ భూమి గురించి పట్టించుకునే వారు లేకపోయారు. మొత్తంగా వ్యవసాయ భూమి ఆదాయం రాని వనరుగా మారింది. ప్రస్తుతం అది ముంపు ప్రాంతంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు చొరవతో మృత్యుంజయ సత్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు డిప్యూటీ కమిషనర్ ముందుకు వచ్చారు. దీనిలో భాగంగా రూ.8 లక్షల వ్యయంతో సత్రం పూర్వ స్థలంలో భీమడోలు పరిసర ప్రాంతాలకు వచ్చే అధికారులు తమ కార్యక్రమాలను నిర్వహించేందుకు భీమడోలు కార్యాలయం ఏర్పాటు నిర్మించారు. ఆ తర్వాత కాలంలో దీనిని దాతల ఆశయాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదికగా వినియోగించుకోనున్నారు. ఇదే క్రమంలో ద్వారకాతిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన రూ.20 లక్షల నిధులతో రామాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. వీటన్నిటి నేపథ్యంలో ఆదివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ సత్రం స్థలంలో నిర్మించిన కార్యాలయాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృత్యుంజయ సత్రం పేరున గల ప్రస్తుతం ముంపునకు గురవుతున్న 18.79 ఎకరాల విస్తీర్ణంలోని వ్యవసాయ భూమిలో 18 ఎకరాల విస్తీర్ణంలో చేపల చెరువుల ఏర్పాటుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ చర్య తీసుకోవడం అభినందనీయమన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కాకినాడ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ భీమడోలు మృత్యుంజయ సత్రం తరహాలో 200 వరకు దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన సత్రాల స్థలాలు, ఆస్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు వాటిని వెలికి తీసి దాతల ఆశయాలకు అనుగుణంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా వాటి ఆదాయాన్ని సద్వినియోగ పరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా, సర్పంచి పి.సునీతమాన్‌సింగ్, ఎఎంసి ఛైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు, ఆల్తి శ్రీను, మద్దాల అప్పారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - కుక్కునూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మండల పరిధిలోని గుండుగూడెంలో సంభవించిన అగ్నిప్రమాదంలో కట్టుబట్టలతో బయటపడిన రెండు కుటుంబాలకు ఆదివారం సిపిఐ కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సాయం అందించారు. ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.500 నగదు అందించారు. బంజరుగూడెంలో అగ్నిప్రమాద బాధితులకు ఆదివాసీ నాయకపోడు కుల ఉద్యోగ సంఘ ఆధ్వర్యంలో రూ.16 వేలు అందించారు. మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, సహాయ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రెండు గిరిజన కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. బాధిత కుటుంబాలు పేద కుటుంబాలని, ఐటిడిఎ అధికారులు గిరిజను లను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలవరం ముంపులో లేని గ్రామమని, వెంటనే గృహ నిర్మాణ పథకంలో ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్వస్వం కోల్పోయిన ఆ కుటుం బాలకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వరసా నాగేశ్వరరావు, ఆదివాసీ నాయకపోడు సంఘం నాయకులు అప్పిరెడ్డి, బానారి బాలకృష్ణ, పెరుమాళ్లు, సౌజన్య పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

జిల్లాలో ఆక్రమణకు గురైన వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు వక్ఫ్ బోర్డు జిల్లా ఛైర్మన్ డాక్టర్ కామిల్ జమ అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో నూతనంగా నిర్మించే మసీదును ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం గ్రామ ముస్లిం మైనారిటీలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌజన్, ఇమామ్‌లకు ప్రభుత్వం నుంచి ఇచ్చే జీతాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం గ్రామ ముస్లిం మైనారిటీలకు చెందిన శ్మశానవాటిక కొంత మేరకు ఆక్రమణకు గురైందని, ఈ విషయం జిలాల అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. శ్మశానవాటిక తుప్పలతో ఉందని, బాగు చేయించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ సాగర్‌బాబు పలువురు వాహనదారులకు సూచించారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులో ఎస్‌ఐ సాగర్‌బాబు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు వాహనదారులతో మాట్లడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు జరిగే అనర్థాలను వివరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నవారితో కొనుగోలు చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'టిడిపి పాలన రావాలి'

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్రంలో సైకిల్ పాలన రావాలని టిడిపి గణపవరం అధ్యక్షులు కూసంపూడి సురేంద్రకుమార్ అన్నారు. గణపవరం బాలచెరువు జూనియర్ కాలేజీ ప్రాంతాల్లో ఆదివానం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రకుమార్ మాట్లాడుతూ వైసిపి పాలనతో రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మళ్లీ సైకిల్ పాలన వస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి కడగళ చిన్నా, నాయకులు పల్లివెంకటేశ్వరరావు, షేక్ బషిరిద్దీన్, పేరిచర్ల మధు పాల్గొన్నారు.

సచివాలయంలో ఘర్షణ

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ-2 సచివాలయ పరిధిలో కృష్ణారావుపాలెం, సూరంపాలెం గ్రామాలు ఉన్నాయి. జగనన్న చేదోడు పథకానికి కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోగా సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి, వాలంటీర్ మవిత కలిసి దరఖాస్తు చేసుకున్న వారి కుటుంబాలకు వెళ్లి టైలరింగ్ చేస్తున్నారో లేదో పరిశీలించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గోళ్లమూడి తిరుపతిరావు, అతని మరదలు గోలమూడి జ్యోతి వాలంటీర్‌తో మాట్లాడుతూ తాము దరఖాస్తు చేసుకున్నామని, తమ పేర్లు ఉన్నాయా అని అడిగారు. వాలంటీర్ భర్త కల్లేపల్లి బాలస్వామి వారి వద్దకు వచ్చి మీ పేర్లు లేవని, తొలగించామని చెప్పారు. దీంతో తిరుపతిరావు, జ్యోతి ఇరువురు కలిసి గ్రామ సచివాలయానికి వెళ్లారు. వాలంటీరు మవిత, ఆమె భర్త బాలస్వామి కూడా సచివాలయానికి వెళ్లి తిరుపతిరావు, జ్యోతిలపై ఘర్షణకు దిగారు. ఇరువురు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరు గ్రూపుల వారు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

చిల్డ్రన్స్ హోమ్‌కు బియ్యం అందజేత

ప్రజాశక్తి - కామవరపుకోట

అనాథ బాలల పాలిట కల్పతరువుగా ఉన్న షేర్ చిల్డ్రన్స్ హోమ్‌కు ప్రతిఒక్కరూ కూడా సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆడమిల్లి గ్రామానికి చెందిన సీడ్ ఆర్గనైజర్ వైసిపి యువ నాయకులు వేముల సాయిబాబు అన్నారు. ఆదివారం చిల్డ్రన్ హోం వారికి వంద కేజీల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూడా చిల్డ్రన్ హోం వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోట్ల లక్ష్మణ్, జెకె సీడ్ నాయుడు, న్యూ జెన్ సీడ్ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మాగంటిబాబు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - కలిదిండి

ఏలూరు మాజీ ఎంపి మాగంటి బాబు పుట్టిన రోజు సందర్భంగా స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో టిడిపి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు స్వీట్స్, బ్రెడ్స్ అందించారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నున్న రమాదేవి, నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ లంకా రత్నారావు, వెంకటాపురం, ఎస్ఆర్‌పి అగ్రహారం సర్పంచులు గూడవల్లి శ్రీనివాసరావు, పరసా వెంకటస్వామి, ఎస్‌సి సెల్ నాయకులు కురేళ్ల ఏడుకొండలు, మాజీ సర్పంచి వాకాని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన రజనీకుమారికి సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మండలంలోని మస్తాన్ మన్యం కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌గా ఉద్యోగోన్నతిపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడివాకలంకకు వెళ్లిన పి.రజనీకుమారిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, తల్లితండ్రులు ఘనంగా సన్మానించారు. నూతన వస్త్రాలు బహుకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు మాట్లాడుతూ సన్మాన గ్రహీత రజనీ ఈ పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు పనిచేశారన్నారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం, దాతల సహకారంతో ఎంతో కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.కనకదుర్గ, ఎఎం.విజయ పద్మలత, గ్రామ విద్యా కమిటీ నాయకులు పాల్గొన్నారు.